''ఏమిటింత ఆలస్యం? ఎందుకు లేటయింది?''.

అప్పటివరకూ ఎంతో సహనంతో ఉన్న నిగ్రహం తను రాగానే అసహనంగా మారింది.

ఆమె వెంటనే ఏమీ మాట్లాడలేదు. మౌనంగా వచ్చి తను ఎప్పుడూ కూర్చునే మంటపం మెట్టు మీద కూర్చుంది.

అది నాలోని అసహనాన్ని మరింత పెంచింది.

ఆమె పక్కనే కూర్చుంటూ మళ్లీ అడిగాను..

''నువ్విలా ఆలస్యంగా రావడం, మౌనంగా ఉండటం నేను సహించలేనని నీకు తెలుసు. అయినా ఈరోజెందుకిలా చేశావ్? గంటన్నర లేటు. గుడి మూసే వేళకూడా అయింది. వెళ్లిపోదామని బయల్దేరుతున్నాను తెలుసా?'' నాకు తెలీకుండానే నాలో కోపం హెచ్చింది.

ఉన్నట్టుండి ఆమె హఠాత్తుగా అరిచినట్లుగా అన్నది.

''వెళ్లిపోండి! ఈరోజు నేను మీ కోసం రాలేదు. నిజంగానే కాసేపు ఆ దేవుణ్ని చూస్తూ మనశ్శాంతిని పొందుదామని వచ్చాను. నన్ను డిస్టర్బ్ చేయకుండా వెళ్లిపోండి''.

నిర్ఘాంతపోయాను నేను.

''భవానీ.. నువ్వేనా మాట్లాడేది?'' నమ్మలేనట్లుగా ప్రశ్నించాను.

ఆమె బదులివ్వకుండా తల తిప్పి గర్భగుడిలోని దేవుడి విగ్రహం వైపు చూడసాగింది.

ఏం జరిగిందో తెలీక నా మెదడు స్తబ్ధుగా అయిపోయింది.

ఆమె చెప్పసాగింది..

''రాత్రి.. సుమతి కొడుక్కి చలిజ్వరం వచ్చింది. డాక్టర్ని పిలిపించి ఇంజక్షన్, మందులూ ఇప్పించారు. కొద్దిసేపయ్యాక వాడికి చలి తగ్గి ఊపిరాడక లేచి ఏడ్వడం మొదలుపెట్టాడు. సుమతి వచ్చి కాసేపు విసనకర్రతో వాడికి విసిరి, ఆ తర్వాత నిద్ర ఆపుకోలేక ఆ పని నాకు అప్పగించి వెళ్లి పడుకుంది. మీకు తెలుసుగా.. మా ఇంట్లో ఫ్యాన్ పనిచేయడం లేదన్న సంగతి. రాత్రంతా నిద్రలేదు. విసనకర్రతో విసిరీ, విసిరీ చేతులు బాగా పట్టేశాయి. తెల్లవారుజామున మళ్లీ రెండు తొట్టెల నిండా నీళ్లు మోయించింది. నా బాధ ఎవరికి చెప్పుకోను? వెంటనే మీ దగ్గరికి రావాలనిపించింది. కానీ మీరు మాత్రం ఏం చేస్తారు? 'ఎవరి పని వాళ్లు చేసుకుంటే తప్పేం ఉంది!' అంటూ నన్నే మందలిస్తారు. రోజూ నాలుగింటికల్లా వచ్చేదాన్ని. ఈ రోజింత ఆలస్యమైందంటే కారణం.. హాస్పిటల్కెళ్లి పడుకొని నిద్రపోవడమే!''.

''ఏమిటీ..?''

ఈసారి మరింత ఆశ్చర్యపోయాన్నేను.

''మీకాశ్చర్యంగానే అనిపిస్తుంది. కానీ, నాకు అలాగేం అనిపించలేదు. నిద్రలేక కళ్లు మంటలు పుట్టి నీళ్లు కారుతున్నాయి. కాళ్లు పీక్కుపోతున్నాయి. కనీసం ఒక్క గంటైనా పడుకుంటానని అడిగే ధైర్యం సుమతి దగ్గర నాకు

